క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల జాబితా

పెడన: ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలని, అందుకు వచ్చిన దరఖాస్తుల విషయంలో కచ్చితత్వం ఉండాల్సిందేనని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్మన్ కె. రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఉదయం ఆమె పెడన పురపాలక సంఘంలో బీఎల్ఓలు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఆమె తనిఖీ చేశారు. అనంతరం ఇన్‌చార్జి కమిషనర్, టీపీఓ ఏసుబాబు సంతకం తీసుకున్న తరువాతే నివేదికలు అందజేయాలని ఈఆర్వో ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ సుందరం వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో పెడన తహసీల్దార్ పి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి అదే గ్రామానికి చెందిన బండే సూర్యనారాయణ-విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష నగదును విరాళంగా గురువారం కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి విరాళం అందించడం ఆనందంగా ఉందని సూర్యనారాయణ దంపతులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, తూనుగుంట్ల మహేష్, అన్నం సురేంద్ర పాల్గొన్నారు.

సాయం అందజేత

పెడన: ఉప్పల కలువగుంటపాలెం గ్రామానికి చెందిన కమలాపురం పీఏసీఎస్ సభ్యుడు రాజులపాటి గోపాలరావు ఇటీవల మృతిచెందాడు. మట్టి ఖర్చుల కింద రూ. 10వేలను మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం పీఏసీఎస్ చైర్మన్ నల్లమోతు నాగేంద్రం అందజేశారు. సంఘ సీఈఓ రమణ ప్రసాద్, కాగిత శ్రీనివాసరావు, సొంతి వీరవెంకట రామమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో దోమల నివారణ మందును సర్పంచ్ కోసూరు అనూష ఆధ్వర్యంలో గురువారం పిచికారీ చేశారు. గ్రామ సచివాలయ మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నాగాయలంక గ్రామంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేశారు. సర్పంచి కైతేపల్లి అంకాలు, ఉప సర్పంచి తలశిల నాని, కార్యదర్శి జరుగు పవన్‌కుమార్, సూపర్‌వైజర్ ఉడుతా శేషగిరి పర్యవేక్షించారు.

నేడు ఎన్ఆర్ఈజీఎస్‌పై ప్రజావేదిక

పెడన: మండలంలో 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ప్రజా వేదిక కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ వి. రెడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పీడీ హాజరవుతారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

మత్స్యకార సంఘం నూతన అధ్యక్షుడి ఎన్నిక

కృత్తివెన్ను: లక్ష్మీపురం ఫిషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ నూతన చైర్మన్‌గా మెకా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారని ఫిషరీస్ ఏడీ నాగబాబు తెలిపారు. మొత్తం 421 మంది సభ్యులున్న ఈ సంఘానికి 2020 అక్టోబర్ 28వ తేదీన ఎన్నికలు జరుగగా కొల్లాటి వడ్డికాసులు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన ఆరోగ్యరీత్యా తన పదవికి రాజీనామా చేయడంతో నూతన అధ్యక్షుడి ఎన్నిక అనివార్యమైందని చెప్పారు. ప్రస్తుతం వెంకటేశ్వరరావును సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. అధ్యక్షునితో పాటు, మిగిలిన ఎనిమిదిమంది సభ్యుల పదవీకాలం 2025 అక్టోబర్ 27వ తేదీతో ముగుస్తుందని చెప్పారు. నూతన అధ్యక్షుడిని స్థానిక సర్పంచ్ కొల్లాటి రాజు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్ అభినందించారు. స్థానిక ఎంపీటీసీ కృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కోడూరులో 'జగనన్నకు చెబుదాం'

కోడూరు: జగనన్న చెబుదాం కార్యక్రమం కోడూరులో శుక్రవారం జరుగుతుందని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా తెలిపారు. స్థానిక దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం మండలాధికారులు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జిల్లా అధికార యంత్రాంగం పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్‌కు వివరించవచ్చని చెప్పారు.

పెన్షనర్ల వితరణ

మచిలీపట్నంటౌన్: 29వ డివిజన్‌కు చెందిన పింఛనుదారు మెట్ల భ్రమరాంబ ఇటీవల మృతిచెందారు. డివిజన్‌లోని పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన మొత్తం రూ. 44,400లను కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ యర్రా శ్రీనివాసకుమార్ భ్రమరాంబ కుమార్తె కారుపర్తి జయలక్ష్మి, కుమారుడు మెట్ల కుమారస్వామిలకు గురువారం అందజేశారు. పింఛనుదారులు, వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

అర్హులను వెతికి మరీ పింఛన్లు అందిస్తున్నాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


నాగాయలంకలో లబ్ధిదారుకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

నాగాయలంక: అర్హులను వెతికి మరీ పింఛన్లు అందిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంక, భావదేవరపల్లి సచివాలయాల వద్ద గురువారం జరిగిన కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో రెండు విడతలుగా 369 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయని అధికారులు వివరించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ అర్హులైన ఏఒక్కరూ ఇబ్బందులు పడకూడదని ఒకటికి నాలుగుసార్లు వెరిఫికేషన్ చేసి మరీ పేదవర్గాలకు పింఛన్లు మంజూరు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమని చెప్పారు. జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొనడంతో జీర్ణించుకోలేని తెలుగుదేశం వర్గాలు దుష్ప్రచారం సాగిస్తున్నారని విమర్శించారు. నాగాయలంక సర్పంచి కైతేపల్లి అంకాలు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్, తోట సాయిబాబు, పంచాయతీ కార్యదర్శులు జరుగు పవన్, మల్లికార్జున్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు దిడ్లకు పింఛన్ పంపిణీ

అవనిగడ్డ: కాంగ్రెస్‌పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దిడ్ల వీరరాఘవులుకు వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరైంది. అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా పింఛన్ మంజూరు పత్రాన్ని పంపిణీ చేశారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి

భావదేవరపల్లి(నాగాయలంక): తీర ప్రాంతాల్లో మత్స్యపరిశ్రమ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక కమ్యూనిటీ భవనంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ, పీఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా మంజూరైన రూ.13,29,798 విలువైన లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాన్ని లబ్ధిదారుడు దేవరకొండ విఘ్నేశ్వరరావుకు ఎమ్మెల్యే అందజేశారు. అవనిగడ్డ మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు ఆర్.ప్రతిభ మాట్లాడుతూ 60 శాతం సబ్సిడీపై నాలుగు చక్రాల వాహనం మంజూరైందన్నారు. వాహనం విలువ రూ.13,29,798లో పీఎంఎస్ఎస్‌వై సబ్సిడీ 36 శాతం కింద రూ.4,78,727 కాగా, ఏపీ మత్స్యశాఖ 24 శాతం సబ్సిడీ 3,19,152 ఉందని, మిగతా 40 శాతం లబ్ధిదారుడు భరిస్తాడని వివరించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పరిశె అమ్మన్న, ఇన్‌చార్జి ఎంపీడీఓ జేకే సీతారామ్‌కుమార్, నాగాయలంక, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షులు ముమ్మారెడ్డి సాంబశివరావు (చంటి), తోట సాయిబాబు, ఎఫ్‌డీఓ సునీత, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

మంచి చేశామని ప్రజలకు చెప్పుకునే దమ్ముందా?

చంద్రబాబుకు ఎమ్మెల్యే సింహాద్రి సవాల్


అవనిగడ్డ పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: 2019 నుంచి ఇప్పటి వరకు ప్రజలకు చేసిన మంచి పనులను చెప్పుకుని ఎన్నికలకు వెళ్లే దమ్ము ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని, చంద్రబాబుకి ఆ దమ్ము ఉందా అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలో నూతనంగా మంజూరైన 150 పింఛన్లను స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచారని చెప్పారు. చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే జైలులో ఉండాల్సి వచ్చిందని, ఆయనపై ఎవరికీ కక్ష సాధింపు లేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేశామని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు తన హయాంలో ప్రజలకు మంచి పనులు చేశామని చెప్పుకునే ధైర్యం లేదన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయ్‌కుమార్, సనకా సుబ్రహ్మణ్యేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీ గోళ్ల కృష్ణకుమారి పాల్గొన్నారు.

సంక్షేమంలో జగన్ దేశానికి రోల్‌మోడల్



సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి; వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి

మంత్రి జోగి రమేష్

గూడూరు: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు మండలం కంకటావ గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ అన్నివర్గాల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అవ్వాతాతలకు సామాజిక పెన్షన్లు మంజూరు చేయడమే కాకుండా ప్రతినెలా ఠంఛనుగా ఒకటో తేదీనే పింఛన్ల సొమ్ము అందిస్తున్నారని చెప్పారు. పలు పథకాల అమలుతీరును వివరించారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం..

గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.22.80 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను మంత్రి జోగి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తన వర్గం వారు మాత్రమే అభివృద్ధి చెందాలన్న దురాలోచనతో ప్రజాధనం అంతా ఒక్కచోటే పెట్టేయాలని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడ్డారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయ భవనాలు, రూ.22.80 లక్షలతో రైతు భరోసా కేంద్రాలు, రూ.17.8 లక్షలతో వెల్‌నెస్ సెంటర్లు, రూ.15 లక్షలతో బల్క్ మిల్క్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నిండుమనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మున్నా, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఆర్బీకే చైర్మన్ గోళ్ల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణతో మళ్లీ గెలుస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మంగళాపురం(చల్లపల్లి): ప్రజల ఆదరణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతగానో ఉందని, వారి ఆశీస్సులతో మరోసారి గెలుస్తామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం మంగళాపురంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 396 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబును పవన్ కల్యాణ్ భుజాన వేసుకుని తుపాకీ చేతబట్టుకుని యుద్ధానికి సిద్ధం అంటే ఆయనతో యుద్ధం చేయాల్సిన ఆవశ్యకత తమకు లేదని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించటం, పేదల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య, పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా మరోసారి ప్రజల ఆదరణ చూరగొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ముద్రగడ పద్మనాభంను, ఆయన కుటుంబాన్ని చంద్రబాబు వేధించినప్పుడు, వంగవీటి రంగా హత్య జరిగినప్పుడు, కాపులకు అన్యాయం జరిగినప్పుడు ఏనాడూ బయటకు రాని పవన్ కల్యాణ్ చంద్రబాబు అరెస్ట్ కాగానే జైలుకు వెళ్లి పలుకరించడాన్ని కాపులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గొరిపర్తి గోపాలకృష్ణ, పార్టీ నాయకులు చండ్ర దుర్గాసాగర్, జుజ్జువరపు భాగ్యారావు, తహసీల్దార్ గోపాలకృష్ణ, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ ఎం.అరుణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భోగాది జగత్ పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్ శ్రీనివాసరావు



కోడూరు: ఎలుకలు పట్టుకొని జీవనం సాగించే ఓ నిరుపేద కుటుంబానికి గ్రామ వలంటీర్ అన్ని తానై వ్యవహరించి అందరి చేత ప్రశంసలు అందుకున్నాడు. రామకృష్ణాపురం సచివాలయం పరిధిలోని ద్వారకా గ్రామంలో పంటకాలువ పక్కన ఓ చిన్న గుడిసెలో మర్రి ఆంజనేయులు తన కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. ఆంజనేయులు పంటపొలాల్లో బుట్టలు పెట్టి ఎలుకలు పట్టుకొని, వాటి ద్వారా వచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి సొంత ఇంటి స్థలం, సరైన నివాస గృహం లేదు. ఆధార్‌కార్డులు కూడా లేని పరిస్థితి. ఆంజనేయులు పరిస్థితిని గమనించిన రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వలంటీర్ పేరే శ్రీనివాసరావు వీరి వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాడు. ఆంజనేయులు కుటుంబ సభ్యులకు తానే దగ్గరుండి ఆధార్ సెంటర్‌లో ఆధార్ కార్డులకు నమోదు చేయించి, కార్డులను ఇప్పించారు. వీరికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి రైస్ కార్డు అందించాడు. ఆంజనేయులుకు 63 సంవత్సరాల వయస్సు ఉండడంతో పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు కూడా పెట్టారు. ప్రభుత్వం సెప్టెంబర్ నెలలో కొత్త పెన్షను మంజూరు చేయడంతో ఈ జాబితాలో ఆంజనేయులు పేరు కూడా వచ్చింది. దీంతో గురువారం పెన్షన్ నగదును ఆంజనేయులుకు సచివాలయ కార్యదర్శి కడవకొల్లు సుబ్బారావు, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.కోటేశ్వర్మ, వలంటీర్ శ్రీనివాసరావులు అందించారు. తన క్లస్టర్ పరిధి కాకపోయినా ఆంజనేయులుకు సహాయం అందించిన వలంటీర్ శ్రీనివాసరావును పలువురు అభినందించారు.

చినగొల్లపాలెంలో అధికారుల పర్యటన

కృత్తివెన్ను: విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ. మురళీమోహన్, డీఈఈ భాస్కరరావు, ఏడీ మాణిక్యాలరావు చినగొల్లపాలెంను గురువారం సందర్శించారు. ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జోగి రమేష్‌కు గ్రామస్తులు విద్యుత్ సమస్యలను తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఆదేశించడంతో అధికారులు పడతడిక, చినగొల్లపాలెం గ్రామాల మధ్య ఉప్పుటేరుపై నుంచి వెళుతున్న విద్యుత్ లైన్లు తీవ్రమైన గాలులు, తుఫానుల సమయంలో తెగిపోతున్నాయని సర్పంచ్ సునీల్, జేసీఎస్ మండల కన్వీనర్ బాపూజీలు అధికారులకు వివరించారు. దీంతో వారు కొత్తకాలువ వంతెనపై నుండి కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో పాటు ఎస్సీ బాలికల హాస్టల్ సమీపంలో హెచ్‌టీ, ఎల్‌టీ లైను, ఏటిమొండి పల్లెపాలెం వద్ద సుమారు 2 కిలోమీటర్ల మేర నూతన విద్యుత్ లైన్ షిఫ్టింగ్ ఏర్పాటు, వీటితో పాటు సుమారు ఒక కిలోమీటర్ మేర నాలుగు నూతన లైన్లు, లో ఓల్టేజ్ సమస్య నివారణకు నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈ వెంకన్నబాబు, ఎంపీటీసీ సాధనాల బాబ్జీ, నాయకులు బాలాజీ, చిన్న, సాల్మన్, సురేష్, ఏడుకొండలు, సూరిబాబు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

బీఎల్ఓలకు కలెక్టర్ రాజాబాబు హెచ్చరిక


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నంటౌన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓ)పై క్రమశిక్షణా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు హెచ్చరించారు. స్థానిక మాచవరంలోని జి కన్వెన్షన్‌హాల్‌లో గురువారం మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై బూత్‌లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ శుక్రవారంతో పోర్టల్ నిలిచిపోతుందని, జిల్లాలో పెరుగుతున్న ఫోటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం వేగవంతంగా జరగాలన్నారు. కొత్త ఓటర్ల నమోదుకు వచ్చిన ఫారం-6 వివరాలు, ఫారం-9 లిస్ట్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివరాలు తెలుసుకుంటున్నారన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకటరమణ, డెప్యూటీ కలెక్టర్ శివనారాయణ రెడ్డి, రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ శ్రీవిద్య, ఆర్ఐ యాకూబ్, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


బహుమతులతో బంటుమిల్లి సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు

పెడన: చేవెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయిని దుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులు 'మోసాన్ని మోసంతో జయించాలి' నాటికను ప్రదర్శించారు. పాత్రధారులుగా సౌమ్య, సంజన, షర్మిల, పావని, సాయి, రాజు, తేజ్‌కుమార్, చరణ్‌లు తమ నటనతో అందరినీ మెప్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలను పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవేశ్వరరావు, భానుశ్రీ, మణికుమర్, రవిచంద్ర, రమేష్, రాజేష్, సాంబశివరావు, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులంలో..

మోపిదేవి: హిందీ భాష గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం హిందీ దివస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కవులు కబీర్‌దాస్, తులసీదాస్ హిందీ భాషకు చేసిన సేవలను వివరించారు. అనంతరం ఆ కవుల వేషధారణలో ప్రదర్శనలిచ్చిన విద్యార్థులను అభినందించారు.

కృత్తివెన్ను: పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ పండిట్ రాజ్యలక్ష్మి, హెచ్ఎం రమణి మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువశాతం మాట్లాడే భాషల్లో హిందీకి నాలుగోస్థానం ఉందన్నారు. జాతీయోద్యమంలో ప్రజలంతా ఏకతాటిపై రావడానికి హిందీ భాష పాత్ర ఎంతో ఉందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీలో పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలల్లో గురువారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు హిందీ కవుల వేష ధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాలల డైరెక్టర్లు కె. కిషోర్, సాబూజాన్ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు.

ఓటరు దరఖాస్తుల పరిశీలన

బంటుమిల్లి: మండల పరిధిలో జరిగిన ఓటరు నమోదు, చేర్పులు, మార్పుల దరఖాస్తులను పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్ఓ), ముడా వైస్ చైర్మన్ రాజ్యలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. స్థానిక మండల రిసోర్స్ సెంటర్‌లో బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మారిన పోలింగ్ కేంద్రాలను ఆమె రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. మండలంలోని 45 పోలింగ్ స్టేషన్ల సమాచారం బీఎల్ఓల ద్వారా తెలుసుకున్న ఆమె ప్రతి ఒక్కరి వద్ద ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, డీటీ కె. రామశివ, ఆర్ఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు బాలికల ఎంపిక



నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి బాలికల ఆటల పోటీలు జరిగాయి. పోటీలను నాగాయలంక జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, ఎంఈఓ 2 అన్నపరెడ్డి రామారావు ప్రారంభించారు. తలగడదీవి, నాగాయలంక, భావదేవరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లకు చెందిన బాలికలు క్రీడా పోటీల్లో తలపడ్డారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు 80 మంది బాలికలు ఎంపికయ్యారని మండల స్పోర్ట్స్ కన్వీనర్ సీహెచ్ సుబ్బారావు, స్థానిక జెడ్పీహెచ్ఎస్ పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఇన్‌చార్జి హెచ్ఎం వి.రామకృష్ణ, పీఈటీ తుంగల శివరత్నకుమారి పాల్గొన్నారు.

నేడు మోక్షగుండం, నరసింహారావు విగ్రహాల ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: ప్రముఖ ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, మరో ఇంజినీర్, విశ్వదాత అవార్డు గ్రహీత చలమలశెట్టి నరసింహారావు విగ్రహాలను శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆవిష్కరించనున్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా మచిలీపట్నం లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాలను స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ సమీపంలోని స్విమ్మింగ్ పూల్ వద్ద ఏర్పాటు చేశారు. ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబర్ 15న కర్ణాటకలో జన్మించారు. కాని ఆయన పూర్వీకులు ఒంగోలు జిల్లా బెస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన వారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇండియన్ ఇరిగేషన్ కమిషన్‌లో పనిచేశారు. 20వ దశాబ్దానికి భారతదేశానికి అవసరమైన ఎన్నో జలాశయాలు, ఆనకట్టలను నిర్మించి దేశాభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం భారతరత్న బిరుదుతో గౌరవించింది. ఆయన పుట్టినరోజునే ఇంజినీర్స్ డే గా నిర్వహించుకుంటున్నారు. అలాగే చల్లపల్లి మండలం నూకలవారిపాలెంలో 1941 సెప్టెంబరు 30వ తేదీన చలమలశెట్టి కృష్ణయ్య, సీతమ్మ దంపతులను నరసింహారావు జన్మించారు. ఆయన విద్యార్థి జీవితం చల్లపల్లిలో కొనసాగింది. పాలిటెక్నిక్, ఎంఐఈఐలో ఉత్తీర్ణత సాధించి ఇరాన్, ఇరాక్‌లలో పనిచేసి ఎన్నో కట్టడాలను నిర్మించారు. అనంతరం మచిలీపట్నంకు వచ్చి ఆయన సేవలు అందించారు. మచిలీపట్నంలో ఇంజినీరింగ్ కన్సల్టింగ్ సంస్థను ఏర్పాటుచేసి ఎందరో యువ ఇంజినీర్లను తయారుచేసి వారికి ఉపాధి చూపారు. బందరు పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ అనే అంశంపై ఆయన వ్యాసం రాశారు.

మిక్కిలినేని కుటుంబ సభ్యులకు పరామర్శ

ఘంటసాల(అవనిగడ్డ): ప్రముఖ రైతు నాయకుడు, కేసీపీ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు మిక్కిలినేని పాపారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి గురువారం పరామర్శించారు. పాపారావు రెండో కుమారుడు మిక్కిలినేని శేషగిరిరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి, నాగిరెడ్డి దాలిపర్రులోని ఆయన స్వగృహంలో శేషగిరిరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాపారావు, శేషగిరిరావు కుటుంబ సభ్యులు, మధుని పరామర్శించారు.

నేడు తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

అవనిగడ్డ: అవనిగడ్డలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభిస్తారని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు.